క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. పెద్దమ్మ జాతర సందర్భంగా మే 11న ముడుపు కడుతున్నందున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఫరూక్ ప్రారంభించారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో తనిఖీలు



లాడ్జీల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నంద్యాల: జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆదేశాల మేరకు జిల్లాలోని లాడ్జీల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పట్టణంలోని పలు లాడ్జీల్లో తనిఖీలు నిర్వహించారు. లాడ్జీల్లో బస చేసిన వారి వివరాలు రిజిస్టర్ ఆధారంగా పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లాడ్జీల్లో బస చేసిన వారి వివరాలు ధ్రువపత్రాల ఆధారంగా సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని, ఎవరిపైనా అనుమానాలు ఉంటే తెలియజేయాలని నిర్వాహకులకు సూచించారు.

కళలను మరింత ప్రోత్సహిస్తాం



రవికృష్ణను సత్కరిస్తున్న గురురాజ డైరెక్టర్లు

నంద్యాల(న్యూటౌన్): కళలను మరింత ప్రోత్సహిస్తామని రంగస్థలం పురస్కారం అందుకున్న డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గురురాజ విద్యాసంస్థల్లో రాష్ట్రస్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థలం పురస్కారం అందుకున్న డాక్టర్ రవికృష్ణను జ్ఞాపికలతో, పూలమాలతో ఘనంగా సన్మానించారు. గురురాజ డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ కళారాధన, గురురాజ స్కూల్ సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వం నందినాటకోత్సవాల్లో వరుసగా ఏడు సంవత్సరాలు బాలల సాంఘిక నాటక విభాగంలో రెండు బంగారు, రెండు వెండి, రెండు కాంస్య, నంది అవార్డులు అందుకుందన్నారు. ఐఎంఏ రాష్ట్ర కమిటీ సభ్యుడు మధుసూదనరావు, లయన్స్‌క్లబ్ నాయకులు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్షణగోడ ఏర్పాటు చేయరూ!



సైడ్‌వాల్ లేక ప్రమాదకరంగా ఉన్న వంతెన

నంద్యాల(అర్బన్): మండలంలోని పెద్దకొట్టాల గ్రామ రహదారిలో ఉన్న పాలేరు వంతెన నిత్య ప్రమాదాలకు నిలయంగా మారింది. ఓ వైపు రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి సమయాల్లో రహదారిపై వెళ్తున్న వాహనదారులు కిందపడి గాయాలైన సందర్భాలు అనేకం. మహానంది దర్శనానికి వచ్చే భక్తులు ఇదే రహదారిపై అహోబిలం వెళ్తుంటారు. ఇటీవల రాత్రి సమయంలో ఇరువురు వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహన వెలుగులో వాగులో పడి గాయాలపాలయ్యారు. గతంలో అనేక సంఘటనలు జరిగినా సంబంధిత అధికారులు ప్రహరీ కానీ, గ్రిల్స్ కానీ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అకాల వర్షం.. రైతన్నకు నష్టం

- గాలివానకు 70 ఏకరాల్లో మామిడి, 50 ఎకరాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న
- 30 ఎకరాల్లో నేలవాలిన బొప్పాయి పంట
- సుమారు రూ. కోటికి పైనే నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని భాధిత రైతుల ఆవేదన





నేల రాలిన మామిడి పంట వద్ద దిగాలుగా కూర్చున్న యువ రైతు సుజీవ్,ముత్యాలపాడు గ్రామంలో కిందపడిపోయిన మొక్కజొన్న పంట వద్ద రైతు రమణయ్య

చాగలమర్రి: మండలంలో శుక్రవారం సాయంత్రం అకాల వర్షం, గాలివాన బీభత్సం సృష్టించింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు కొంపముంచాయని, ఆ నష్టాన్ని రబీ సీజన్‌లోనైనా పూడ్చుకోవాలనే ఆశతో పంటలను సాగు చేస్తే ఇప్పుడు కూడా సాగు చేసిన పంటలపై ప్రకృతి కన్నెర్ర చేసిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షం, గాలివానకు పంటలు నేల కొరిగి, మామిడి పంట నేల రాలడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయని లబోదిబోమంటున్నారు.

నేల రాలిన మామిడి..

శుక్రవారం సాయంత్రం వీచిన గాలులకు, వర్షానికి మండలంలో సుమారు 70 ఎకరాల్లో మామిడి, 50 ఎకరాల్లో మొక్కజొన్న, 30 ఎకరాల విస్తీర్ణంలో బొప్పాయి పంటలు నేలవాలడంతో రైతులకు రూ.కోటి నష్టం వాటిల్లింది. ముత్యాలపాడు గ్రామానికి చెందిన రైతులు సుబ్బలక్ష్మమ్మ, రమణయ్య, బయ్యన్నగారి రామకృష్ణ, రామచంద్రుడు, బాలనాగన్నగారి పెద్ద వేంకటేశ్వర్లు, పెద్దవంగలి గ్రామానికి చెందిన రైతులు ప్రభుకాంత్, ఉప్పలపాటి సుజీవ్, దానమ్మ, మరియమ్మ, మధుబాబు, హారి, ఉమామహేశ్వరిదేవిలకు చెందిన మామిడి తోటల్లో పూత, పిందె, కాయలు నేల రాలడంతో ఎకరాకు సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా తోడేండ్లపల్లె, ముత్యాలపాడు, డి.వనిపెంట గ్రామాల్లో సుమారు 50 ఎకారాల మేర మొక్కజొన్న పంట నేల వాలడంతో ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టం వాటిల్లింది. అదే విధంగా మండలంలోని చిన్నవంగలి గ్రామాంలో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో చేతి కందివచ్చిన బొప్పాయి చెట్లు విరిగిపడటంతో ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టం చేకూరింది. చంద్రఓబుళరెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో విద్యుత్ తీగలపై చెట్టు విరిగిపడటంతో తీగలతోపాటు విద్యుత్ స్తంభం విరిగి సమీపంలోని బోరు స్టార్టరుపై పడడంతో సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. కొంత మంది రైతులు సాగు చేసిన కమర్షియల్ మొక్కజొన్న పంటకోత తరువాత రోడ్ల ఆరబోసుకోగా.. వర్షంతో ధ్యాన్యం తడిసిపోయింది. వ్యవసాయాధికారులు త్వరగా సర్వే చేసి అంచనాలను ప్రభుత్వానికి పంపి నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



చిన్నవంగలిలో చెట్టు విరిగి పడటంతో దెబ్బతిన్న విద్యుత్ స్తంభం, మోటారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెంటనే నష్టపరిహారం అందేది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందజేసి ఆదుకునే వారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. శుక్రవారం మండలంలో సంభవించిన గాలివానకు మామిడి కాయలు, పూత, పిందెలు నేల రాలాయి. పంట నష్టాన్ని అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపి వెంటనే నష్టపరిహారాన్ని మంజూరు చేసి ఆదుకోవాలి.
– ప్రభూకాంత్, మామిడి రైతు, పెద్దవంగలి

33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం ఉంటేనే పరిహారం

33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం వస్తుంది. చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామాలలో పంట నష్టపోయిన పొలాలను పరిశీలించి ఎక్కువగా పంట నష్ట పోయిన రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. – శ్రీధర్, ఇన్‌చార్జ్ ఉద్యాన అధికారి

జూన్1న ప్రతిభకు పట్టాభిషేకం

నంద్యాల(వ్యవసాయం): ఉమ్మడి కర్నూల్ జిల్లా పరిధిలోని పద్మశాలీ కులానికి చెందిన విద్యార్థులను ప్రోత్సహిస్తు జూన్ 1వ తేదీన ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తామని పద్మశాలీయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు భీమునిపల్లి వెంకటసుబ్బయ్య, గాజుల శంకర్ తెలిపారు. ఆదివారం భద్రవతి భావన రుషి దేవాలయంలో జరిగిన సమావేశంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 10వ తరగతిలో 540మార్కులు, ఇంటర్‌లో 900 మార్కులు పైబడి సాధించిన వారు ఇందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.7,500, మూడో బహుమతిగా రూ.5వేలు, కన్సోలేషన్ బహుమతిగా రూ.2వేలు అందజేస్తామని వివరించారు. ఈ నెల 15వ తేదీలోపు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను అందజేయాలని చెప్పారు. నాయకులు సాదు సూర్యనారాయణ, చెన్న వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, గాజుల ఎర్రయ్య, చెన్న శీను పాల్గొన్నారు.

చెరువును కాపాడండి

మహానంది: గుంటూరు నుంచి గుంతకల్లు రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా గాజులపల్లె రైల్వేస్టేషన్, నంద్యాల వద్ద పనులకు చెరువుల నుంచి లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపునకు అనుమతులు ఇవ్వడం దారుణ మని గోపవరం వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ గోపవరం గ్రామంలోని బైరవాణి చెరువు నుంచి సుమారు 75 వేల క్యూబిక్ మీటర్ల మట్టి(సుమారు 55వేల టిప్పర్లు) తరలింపునకు అధికారులు అనుమతి ఇవ్వడం బాధాకరమన్నారు. మట్టి తరలింపు కోసం రైల్వే అధికారులు చెరువులో ఉన్న నీటిని బయటికి తరలిస్తే రైతుల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో కోటేష్

నంద్యాల(అర్బన్): జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని కోటేష్ అకాడమీ డైరెక్టర్ కోటేష్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులతో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. కోటేష్ మాట్లాడుతూ ఈ నెల 5న విజయవాడలోని డ్రీమ్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో 12వ బాలుర జాతీయ స్థాయి చిత్రకళ ప్రదర్శన పోటీలు జరిగాయన్నారు. పోటీలకు కోటేష్ ఆర్ట్ అకాడమీ నుంచి 28 మంది విద్యార్థులు వేసిన చిత్రాలు పంపగా 16 మంది చిత్రాలు పతకాలు సాధించాయన్నారు. పసిడి, రజత, సర్టిఫికెట్లను డ్రీమ్ ఆర్ట్ అకాడమీ కొరియర్ ద్వారా పంపారన్నారు. సాహిత్, మృదుల, రాగవైష్ణవి, శ్రేష్ఠ, లాస్యశ్రీ, సాయిహఫీస్, జోషిక, దిబంకూర్ బంగారు పతకాలు సాధించారు.

అన్యాయాన్ని సరిచేసేందుకే వక్ఫ్ చట్టం



వక్ఫ్ సవరణ చట్టం కరపత్రాలను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): దేశంలో దశాబ్దాలుగా పేద ముస్లింలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయడానికే వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని బీజేపీ నాయకులు మేడా మురళీధర్, కాశెట్టి కృష్ణమూర్తి, వంకదార గోపాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో వక్ఫ్ చట్ట సవరణపై కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ముస్లింలు తమ తదనంతరం ఆస్తులను పేద ముస్లిం ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం అల్లాకు రాసి ఇచ్చే ఆస్తులను వక్ఫ్ అంటారని.. అయితే ముతవల్లులు ఈ ఆస్తులను పర్యవేక్షించి తద్వారా వచ్చిన ఆదాయాన్ని పేద ముస్లిం ప్రజలకు అందించడంలో విఫలమవుతున్నారని అందుకే బోర్డును పటిష్ట పరిచేందుకు చట్టసవరణ చేశారని వివరించారు. నాయకులు నిమ్మకాయల సుధాకర్, షేక్ చాందిని, రమేష్, బ్రహ్మం పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

మహానంది: స్థానిక వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం తమ్మడపల్లెలో రహదారి భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మాధవి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని వారు ద్విచక్రవాహనదారులకు సూచించారు.

గాలివాన బీభత్సం

- ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం
- నేలకొరిగిన భారీ వృక్షాలు
- తడిసిన ధాన్యం, పసుపు
- నేలవాలిన వరి, మొక్కజొన్న పంటలు
- రైతన్నకు భారీగా పంటనష్టం





హరినగరం సమీపంలో నేలవాలిన మొక్కజొన్న , ఆళ్లగడ్డలోని ఆశ్రమం వీధిలో నేలవాలిన వృక్షం

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం పెనుగాలు బీభత్సం సృష్టించాలి. దీనికి తోడు భారీ వర్షం కుసింది. దీంతో పెద్దపెద్ద వృక్షాలు కూలిపోయాయి. రుద్రవరం మండలం ఆలమూరులో సాగుచేసిన బొప్పాయి పంటంతా విరిగి నేలవాలడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే అకాల వర్షానికి వరి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. గత నెలరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వం మాత్రం రైతుల వైపు కన్నెత్తికూడా చూడటం లేదని ఆరోపిస్తున్నారు.

దాన్యం వర్షార్పణం

రుద్రవరం: మండలంలో ఆదివారం సాయంత్రం భారీగా ఈదురు గాలులు వీస్తూ ఉరుములు, మెరుపుల మధ్య ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి నర్సాపురం, రుద్రవరం, హరినగరం తదితర గ్రామాల పరిధిలో భారీ వృక్షాలు నేల కూలాయి. దీంతో వాహనాల రాకపోకలకు గంటల తరబడి అంతరాయం ఏర్పడింది. అలాగే కోత దశలో ఉన్న వరి, మొక్క జొన్న పంటలు నేల వాలాయి. ప్రస్తుతం వరి, మొక్క జొన్న కోతలు జోరుగా సాగుతున్నాయి. వచ్చిన ధాన్యాన్ని రైతులు బయలు ప్రదేశాలు, ఆర్అండ్‌బీ రోడ్లపై ఆరబోసుకున్నారు. ఉన్న ఫలంగా వర్షం కురవడంతో ఆరబోసిన ధాన్యం, పసుపు మొత్తం తడిసి పోయాయి. మండలంలోని నర్సాపురం, రుద్రవరం, హరినగరం, ముత్తలూరు, తండా, తిమ్మనపల్లె, ముకుందాపురం, చిత్రేనిపల్లె తదితర గ్రామాల పరిధిలో ఈ పరిస్థితి నెలకొంది.

దొర్నిపాడులో..

దొర్నిపాడు: ఉన్నట్టుండి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో మండలంలో గాలివాన దంచికొట్టింది. దీంతో ఉక్కపోతకు అల్లాడుతున్న జనానికి వర్షంతో పాటు చల్లటి గాలులతో వీయడతో స్థానికులు ఊరట చెందారు. ఇక పోతే కల్లాల్లో ఉన్న మిరప, వరిధాన్యంపై పట్టలు కప్పుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. గిట్టుబాటు ధర కోసం దిగుబడులను కల్లాలోనే ఉంచుకుంటే అకాల వర్షాలు రోజూ ఇబ్బందులు పెడుతున్నాయి.



ఆలమూరు సమీపంలో తడిసిన పసుపు



దొర్నిపాడులో వర్షం పడుతున్న దృశ్యం

నన్ను పట్టించుకోరా?



తుప్పపట్టి నియోపయోగంగా ఉన్న జనరేటర్

ఏళ్ల తరబడి నన్ను ఎవరూ పట్టించుకోవడం లేదు.. నా అవయవాలన్నీ తుప్పు పట్టి పనికి రాకుండా పోతున్నాయి.. ఇకనైనా నన్ను కాస్తా పట్టించుకోండి.. ఇది నంద్యాల తహసీల్దార్ కార్యాలయ వెనుక భాగంలో ఉన్న జనరేటర్ ఆత్మఘోష. కార్యాలయానికి విద్యుత్ అంతరాయం ఉండకుండా ఉండేందుకు గతంలో ప్రభుత్వం జనరేటర్‌ను మంజూరు చేసింది. అయితే కొన్నేళ్లుగా చిన్న మరమ్మతుల కారణంగా జనరేటర్‌ను అధికారులు వినియోగించుకోవడం మానేశారు. దీంతో రూ.లక్షల విలుజేసే జనరేటర్ తుప్పు పట్టి పోతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి వినియోగించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – నంద్యాల(అర్బన్)

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ముత్యాలపాడు ఎస్‌పీజీ చర్చిలో భక్తులకు సందేశమిస్తున్న పాస్టర్ రెవ.ఆర్ఏఈ.సంజీవ్‌రాజ్





రుద్రవరంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు, చాకరాజువేముల చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, ఎల్లావత్తుల, కోటకొండ, బీరవోలు, పేరూరు, మందలూరు, ముత్తలూరు, నర్సాపురం, తిమ్మనపల్లె, చిత్రేనిపల్లె తదితర గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో యువకులు ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. మధ్యాహ్నం ఆయా గ్రామాల్లోని మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రమైన రుద్రవరంలో పాస్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దొర్నిపాడులో..

దొర్నిపాడు: మండలంలో క్రైస్తవులంతా పునరుత్థానం (ఈస్టర్) పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వేకువ జాము నుంచే యువకులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. చర్చిల్లో భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. చాకరాజువేముల, దొర్నిపాడు, గుండుపాపాల, క్రిష్టిపాడు, డబ్ల్యూకొత్తపల్లె, డబ్ల్యూగోవిందిన్నె, బుర్రారెడ్డిపల్లె తదితర గ్రామాలో అత్యంత వైభవంగా పండుగను జరుపుకున్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో యువకులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా మాఘం ఆశీర్వాదమ్మ తన పింఛన్ సొమ్మును మొదటి రెండు బహుమతులకు రూ.5వేలు అందజేసింది.

మరణించిన ప్రభువు 3వ రోజు తిరిగి లేచాడు

చాగలమర్రి: ఏసు ప్రభువు మరణించిన 3వ దినం తిరిగి సమాధి నుంచి లేచిన రోజును యవత్ క్రైస్తవ లోకమంతా ×ఈస్టర్ డే¥ పేరుతో పండుగను నిర్వహించుకుంటున్నామని పాస్టర్ రెవ.ఆర్ఏఈ సంజీవ్ రాజ్ అన్నారు. మండలంలో ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముత్యాలపాడు గ్రామంలోని అతి పురాతనమైన ఎస్‌పీజీ చర్చిలో పాస్టర్ రెవ.ఆర్ఏఈ సంజీవ్ రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఈస్టర్ ఎగ్స్, షెప్పర్డ్ యూత్ సభ్యుల ద్వారా బెల్లం పానకం, గుగ్గులు పంపిణీ చేశారు. అలాగే చాగలమర్రి, గోడిగనూరు, జ్ఞానాపురం, శెట్టివీడు, మద్దూరు, పెద్దబోధనం, తిప్పనపల్లె, నెలంపాడు, తదితర గ్రామాల్లోని చర్చిలలో ఫాదర్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చాగలమర్రిలోని పాత, కొత్త ఎస్సీ కాలనీల్లో యువతీ, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో చర్చిల ఫాదర్‌లు రెవ.జీవీ చంద్రశేఖర్, రెవ.సంపత్‌కుమార్, రెవ.చిరంజీవి, రెవ.జాన్ ప్రభాకర్, రెవ.విద్యాకర్, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



క్రిష్టిపాడులో క్రికెట్ పోటీల విజేతలకు నగదు బహుమతిని అందిజేస్తున్న ఆశీర్వాదమ్మ



చాగలమర్రిలోని కొత్త ఎస్సీ కాలనీలో రంగుల చల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న యువకులు



పాస్టరేట్-6 ఆలయంలో దైవసందేశం ఇస్తున్న పాస్టరేట్ చైర్మన్ కాంతరావు

క్రీస్తు పునరుత్థానం..
మానవాళికి రక్షణ మార్గం

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

నంద్యాల(న్యూటౌన్): క్రీస్తు మరణాన్ని జయించి మృత్యుంజయుడు అయి సజీవునిగా లేచిన సందర్భంగా క్రైస్తవులు ఆదివారం క్రీస్తు పునరుత్థాన పండుగను జరుపుకున్నారు. క్రీస్తు పునరుత్థానం మానవాళికి రక్షణ మార్గాన్ని చూపిందని, సమస్త మానవాళి పాపాలకు రెండు వేల సంవత్సరాల క్రితం సిలువపై బలియాగంగా మారిన ఏసు క్రీస్తు మూడవ దినమున తిరిగి సజీవుడయ్యాడని పరిశుద్ధ మత్తయి ఆలయ డీనరీ చైర్మన్ నందం ఐజక్ అన్నారు. పట్టణంలోని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1, పరిశుద్ధమత్తయి, చిన్నచర్చి ఆలయంలో సందేశమిచ్చారు. శనివారం అర్ధరాత్రి తర్వాత ఆదివారం వేకువ జామున 3గంటలకు ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. డీనరీ చైర్మన్లు జోసఫ్‌బాబు, ఇమ్మానియేల్, విజయ్‌కుమార్ దైవ సందేశాన్ని వినిపించారు. డానియేల్‌పురం పాస్టరేట్ చైర్మన్ కాంతరావు, టెక్కె పాస్టరేట్ చైర్మన్ సుమిత్రబాబు, జోయెల్‌లతో పాటు సంఘస్తులు కారురవి కుమార్, కిరణ్, బాలయ్య, ప్రభుదాసు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు..


నంద్యాలలోని సీఎస్ఐ చర్చి, యేసుకృప, హోసన్నా ప్రార్థనా మందిరం, బేతేలు ప్రార్థనా మందిరం, కర్మేలు ప్రార్థనా మందిరం, హోరేబు చర్చి, పెంతెకోస్తు ప్రార్థనా మందిరం, తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయము, పరిశుద్ధ ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం, దేనియల్‌పురం, సీఎస్ఐ చర్చిలలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ప్రభుదాసు, రాజారావు, జాన్ బెన్ని, అన్సాస్, నందం సుధాకర్, మన్నెం జానయ్య, జాకోబ్ దైవ సందేశాన్నిచ్చారు.



సీయోను ప్రార్థన మందిరంలో పాల్గొన్న యువతీ, యువకులు



రంగులు చల్లుకుంటున్న యువకులు



దైవసందేశం ఇస్తున్న ఏసుదాసు

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసు క్రీస్తు పునరుత్థానం అయిన సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.